క్లుప్తంగా

ఆంధ్రా సుగర్స్‌లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

వెంకటరాయపురం ది ఆంధ్రా సుగర్స్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

తణుకు అర్బన్: ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సూచనలతో వెంకటరాయపురంలోని ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశ్రమలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సంస్థ అడిషినల్ సెక్రటరీ పీవీఎస్ విశ్వనాథకుమార్ మాట్లాడుతూ పర్యావరణానికి విఘాతం కలిగించే అంశాలకు దూరంగా ఉంటే పర్యావరణ పరిరక్షణకు పాటుపడినట్లేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ టెక్నికల్ ఎడ్వయిజర్ జి.రంగారావు, హెచ్ఆర్ విభాగ అధికారి పి.శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ విభాగం అధికారి జి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

ప్రసాద్ మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న దృశ్యం

పెనుగొండ: గోదావరిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తూ జారి పడి ఓ యువకుడు మరణించాడు. వివరాల్లోకి వెళితే కరుగోరుమిల్లి పుష్కరాల రేవులో స్నేహితులతో కలసి వల్లూరు గెద్దాడ వారి పాలెంకు చెందిన జక్కంశెట్టి భానుప్రసాద్(18) స్నానానికి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం రెండుగంటల సమయంలో ప్రమాదవ శాత్తు జారి పడిపోవడంతో గల్లంతయ్యాడు. స్నేహితులు రక్షించడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది, దీంతో స్థానికులు, పోలీసులు, పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది కలసి గాలించగా సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. దీంతో బంధువుల ఆర్తనాదాలు స్థానికులను కలచివేశాయి. మృతుడి బావ దొంగ విఘ్నేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా వెంకట రమణ తెలిపారు.

ఇంటి వద్దకే.. మీ సెల్‌ఫోన్

సెల్‌ఫోన్ అందజేస్తోన్న ఏలూరు వన్‌టౌన్ సీఐ రామకృష్ణ

ఏలూరు టౌన్: జిల్లాలో ఆపరేషన్ రిస్టోర్‌లో భాగంగా తమ విలువైన మొబైల్ ఫోన్లను పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వాటిని ఎంతో శ్రమించి రివకరీ చేసి శుక్రవారం బాధితుల ఇంటివద్దకే వెళ్లి పోలీసులు అందజేశారు. ఏలూరు సైబర్‌సెల్ సీఐ దాసు తమ టెక్నికల్‌టీమ్‌తో ఏలూరు జిల్లాలో సుమారు 322 మొబైల్ ఫోన్లు రికవరీ చేశారు. ఈ సెల్‌ఫోన్ల విలువ సుమారుగా రూ.60 లక్షల 40 వేలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్‌డివిజన్ల పరిధిలో పోలీస్ అధికార యంత్రాంగం నేరుగా బాధితుల ఇళ్లకే వెళ్లి సెల్‌ఫోన్లు అందజేశారు. ఇప్పటికే నమోదైన కేసులపై దర్యాప్తు చేపట్టి మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్‌తో కొద్దిరోజుల్లోనే 322 ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అందించారు.

పరాయి పంచన డీఐఈఓ కార్యాలయం

వేధిస్తున్న సిబ్బంది కొరత

భీమవరం: విద్యకు పెద్ద పీట వేస్తున్నామంటూ ప్రభుత్వం గొప్పగా ప్రచారం చేస్తున్నా పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంటర్మీడియట్ కార్యాలయానికి సొంత గూడు, సిబ్బంది లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయానికే సొంతగూడు లేక పరాయి పంచన కాలక్షేపం చేస్తుంటే ఇంటర్మీడియట్ విద్యాశాఖ నిర్వహణ ఎలా ఉంటుందో? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు రెండు ఎయిడెడ్, రెండు సోషల్ వెల్ఫేర్, సుమారు 82 ప్రైవేటు కళాశాలలున్నాయి. ఇవికాక ఈ ఏడాది మరికొన్ని జూనియర్ కళాశాలల ఏర్పాటుకు అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఇంటర్మీడియట్ విద్య నిర్వహణకు జిల్లా కేంద్రమైన భీమవరంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయానికి సొంత భవనం లేక కొంతకాలంగా పట్టణంలోని గ్రంథి వెంకటేశ్వరరావు(జీవీఆర్) ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోని చిన్న గదిలో తాత్కాలికంగా కార్యాలయం ఏర్పాటు చేసుకుని విధులు నిర్వహిస్తున్నారు.

ఇద్దరితో నెట్టుకొస్తున్న వైనం

ఇంటర్మీడియట్ కార్యాలయంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారితో (డీఐఈఓ)పాటు

భీమవరంలో డీఐఈఓ కార్యాలయం ఏర్పాటు చేసింది ఇక్కడే

సూపరింటెండెంట్, యూడీసీ, ఎల్‌డీసీ, ఏవో, అటెండర్ వంటి సుమారు 15 మంది వరకు సిబ్బంది పని చేయాల్సి ఉంది. అయితే ఇక్కడ సూపరింటెండెంట్, యూడీసీ, డిప్యూటేషన్‌పై అటెండర్ మాత్రమే పని చేస్తున్నారు. ఇటీవల సూపరింటెండెంట్, యూడీసీలకు పదోన్నతులు లభించడంతో రెండు సీట్లు ఖాళీ అయ్యాయి. దీంతో ప్రస్తుతం డీఐఈఓ, అటెండర్‌తోనే కాలక్షేపం చేస్తున్నారు. దీంతో కొత్తగా కళాశాల ఏర్పాటుకు అనుమతులు, అడ్మిషన్స్, ఇంటర్ పరీక్షల నిర్వహణ వంటి వాటిని పర్యవేక్షించడం వారికి తలకుమించిన భారంగా మారింది.

సొంత భవనం లేక ఇబ్బందులు

గత కొంతకాలంగా భీమవరం పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వం జూనియర్ కళాశాలలోని చిన్నపాటి గదిలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్న అధికారులు పరీక్షల నిర్వహణకు ఇబ్బందిగా ఉండడంతో క్యాంప్‌ను తాత్కాలికంగా పట్టణంలోని కేజీఆర్ఎల్ కళాశాల ఆవరణలోకి మార్చారు. ఈ నెల 6 నుంచి జూనియర్ కళాశాలలు నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న తరుణంలో అనేక ప్రైవేట్ కళాశాలలో ఇబ్బడి ముబ్బడిగా ఫీజులు వసూలు, కళాశాలల వద్దనే బుక్స్, విద్యాసామాగ్రి వంటివి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే డీఐఈఓ కార్యాలయానికి తగిన సిబ్బంది, అనుకూలమైన కార్యాలయం భవనం లేకపోవడం చూస్తుంటే వీరి పర్యవేక్షణ ఎలా ఉంటుందోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కలెక్టరేట్‌లో సముదాయంలోనే జిల్లా విద్యాశాఖ కార్యాలయం నిర్వహిస్తుండగా డీఐఈఓ కార్యాలయం ఎవరికీ అంతగా అందుబాటులో లేని చోట నిర్వహించడం వెనుక ఆంతర్యం అంతుబట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అనుమతులు లేని కళాశాలలకు ప్రారంభోత్సవం

జిల్లాలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. అనుమతులు లేని విద్యాసంస్థలకు ప్రజాప్రతినిధులే ప్రారంభోత్సవాలు చేయడం దీనికి నిదర్శనంగా ఉందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవేటు విద్యాసంస్థలను నడుపుతున్న యాజమాన్యాలపై అధికారులు మెతకవైఖరే దీనికి కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని 20 మండలాల పరిధిలో అనేక ప్రైవేటు పాఠశాలలు, కళాశాలు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే నడుపుతున్నారు. ఒక్క భీమవరం పట్టణం, భీమవరం మండలాల్లోనే 48 ప్రైవేట్ పాఠశాలలకు గాను 25 పాఠశాలలకు ప్రస్తుత విద్యాసంవత్సరానికి ఎలాంటి అనుమతులు లేవు. అలాగే ప్రస్తుత విద్యాసంవత్సరానికి జిల్లాలో 7 నూతన కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వానికి దరఖాస్తులు చేసుకున్నట్లు విద్యాశాఖ చెబుతుంది. అయితే వీటికి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అనుమతులు రాకుండానే పెద్ద సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుంటుండగా వారి వద్ద నుంచి ఫీజుల రూపంలో లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భీమవరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కళాశాలను పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవం చేయడం విశేషం.

అక్రమంగా విద్యాసామగ్రి విక్రయాలు

భీమవరంలో శ్రీచైతన్య స్కూల్లో పుస్తకాలను నిల్వ చేసిన గదిని సీజ్ చేసిన దృశ్యం

భీమవరం: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలను విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తనిఖీ నిర్వహించారు. పుస్తకాలు ఉన్న గదిని గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు సాయి కృష్ణ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి అధిక ఫీజులు, విద్యాసామగ్రి విక్రయాలతో తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారన్నారు. శ్రీచైతన్య స్కూల్లో అక్రమంగా విద్యాసామగ్రి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి రావడంతో విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ నాయకులు బి.సింధు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

థర్మాకోల్ లోడు లారీ దగ్ధం

ఉండి: మండలంలోని పాములపర్రు గ్రామంలో శుక్రవారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో థర్మాకోల్ లోడు లారీ దగ్ధమైంది. స్థానికులు,అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ధర్మకోల్ లోడుతో గణపవరం నుంచి ఆకివీడు బయలుదేరిన లారీ పాములపర్రులోని పెదకాపవరం రోడ్డులోకి వెళ్లింది. రోడ్డులోకి తిరిగిన కొద్ది దూరంలోనే లారీకి విద్యుత్ తీగలు తగలడంతో ఒక్కసారిగా లారీలోని థర్మాకోల్‌కు మంటలు అంటుకుని పెద్దగా వ్యాపించాయి. ఇది గమనించని లారీ డ్రైవర్ ముందుకు వెళ్లడంతో స్థానిక మహిళలు గట్టిగా కేకలు వేశారు. దీంతో లారీ డ్రైవర్ లారీలో నుంచి కిందికి దూకేశాడు. అదే ప్రాంతంలో రోడ్డును ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు లారీ తాకడంతో ప్రమాదం మరింత పెద్దదైంది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో పాటుగా నల్లని పొగ గ్రామమంతా అలముకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురైయ్యారు. సమాచారం అందుకున్న ఆకివీడు అగ్నిమాపక అధికారి వెంకటేశ్వరరావు తన సిబ్బందితో ప్రమాద

పాములపర్రులో దగ్ధమవుతున్న థర్మాకోల్ లోడు లారీ

స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని ఆయన అంచనా వేశారు.

నవధాన్యాల సాగు.. పంటలకు బాగు

ముసునూరు : రసాయన ఎరువుల వాడకంతో భూసారం క్షీణించడంతో పాటు పర్యావరణ కాలుష్యం ఏర్పడి రైతులకు సాగు ఖర్చు పెరగడమే కాక దిగుబడులపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో నేల ఆరోగ్యం, ఉత్పాదక శక్తి పెంపు, సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన పెరగడంతో పచ్చిరొట్ట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. దీనికి తోడు పశువుల ఎరువులు, వర్మీ కంపోస్ట్ కొరత, ధరలు అధికం కావడంతో రైతులు పచ్చి రొట్ట ఎరువుగా నవధాన్యాల సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాల సాగు బాగా దోహదపడుతుంది. దీనికి అనుగుణంగానే ప్రకతి వ్యవసాయ శాఖ అధికారులు నవధాన్యాల పంటల సాగుపై అవగాహన కల్పించి, విత్తనాలిచ్చి, రైతులను ప్రోత్సహిస్తున్నారు.

పచ్చిరొట్ట సాగు పై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

నవ ధాన్యాల రకాలు

వరి, గోధుమ, ఉలవ,పెసలు,కందులు, నువ్వులు, అనుములు,మినుములు, శెనగలు. వీటితోపాటు పచ్చిరొట్ట కోసం జొన్నలు, మొక్కజొన్నలు, సజ్జలు, జనుము, జీలుగ, పిల్లిపెసర, రాగులు, తదితర చిరు ధాన్యాలు కూడా పచ్చిరొట్ట సాగు కోసం వినియోగించుకోవచ్చు.

ప్రయోజనాలివే

- నేల నిర్మాణాన్ని మెరుగుపరుస్తుంది. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. నేల కోతను నివారించి నష్టాన్ని తగ్గిస్తుంది.
- నవధాన్యాల విత్తనాలు ఎక్కువ రకాలుగా చల్లడం వల్ల మొక్కలు సన్నగా ఎదిగి, నేలలో కలియ దున్నినప్పుడు వేగంగా కుళ్లి, నేలలో కలిసిపోతాయి. దీంతో నేలలో సేంద్రియ కర్బనం పెరుగుతుంది.
- నేలలో ఉండే ప్రయోజనకర సూక్ష్మజీవుల సంఖ్యను మెరుగుపరుస్తుంది.
- వేర్లు భూమిలో ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల నేలను అధికంగా గుల్లబారేలా చేస్తుంది.
- రసాయన ఎరువుల వాడకాన్ని 35 నుంచి 45 శాతం వరకు తగ్గించడంలో సహాయపడతాయి.
- కలుపు మొక్కలను తగ్గించడంలోనూ సహాయపడతాయి. పశువుల మేతగా కూడా వాడవచ్చు.

పచ్చిరొట్టను కలిపే విధానం

పళ్లెపు నాగలితో పంటకు 60 నుంచి 80 రోజుల వ్యవధి వచ్చినపుడు నవ ధాన్యాల రొట్టను కలియ దున్నడం వల్ల మట్టిలో బాగా కలిసి పోతుంది. రోటవేటర్ ను ఉపయోగిస్తే జీవ పదార్థం వేగంగా కుళ్లిపోతుంది.

పోషకాలు పుష్కలం

నవధాన్యాల పచ్చిరొట్టను పెంచి పొలంలో కలియదున్నడం ద్వారా పుష్కలమైన పోషకాలు పంటకు అందుతాయి. దీని వల్ల పంట సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధిస్తారు. ప్రకతి సేద్యం విభాగం ద్వారా నవ ధాన్యాల విత్తన పంపిణీ కొనసాగుతోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆలూరు చాముండేశ్వరి, మండల వ్యవసాయ శాఖాధికారి, ముసునూరు

ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని ముస్లింలు, బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులతో కలిసి జంగారెడ్డిగూడెం బోసు బొమ్మ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిటీ కేబుల్ ఎండీ పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో గౌరవంగా పూజించుకునే గోమాతను జాతీయ జంతువుగా ప్రకటించాలని ముస్లింలు కోరడం అభినందనీయమన్నారు. జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు మొహమ్మద్ అబ్దుల్ నబీ మాట్లాడుతూ అంతా సమైక్యతతో ఉండి ఆవును కూడా జాతీయ జంతువుగా ప్రకటించే ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కొప్పాక శ్రీనివాసరావు, విశ్వ

ఆవును జాతీయ జంతువుగా గుర్తించాలని కోరుతూ మానవహారం నిర్మించిన ముస్లింలు, హిందువులు

హిందూ పరిషత్ నాయకులు తిప్పాభట్ల రామకృష్ణ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

తాడిచెట్టు పడి వ్యక్తి మృతి

భీమవరం: ఎండ వేడిని తట్టుకోలేక ఆరుబయట కూర్చున్న వ్యక్తిపై తాడిచెట్టుపడి మృతి చెందిన ఘటన భీమవరం గరువుపేటలో శుక్రవారం చోటుచేసుకుంది. భీమవరం వన్‌టౌన్ ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని 11వ వార్డు గరువుపేటకు చెందిన పాలపర్తి రాజ్ కుమార్ (29) క్యాటరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి వివాహం కాగా భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరా లేకపోవడంలో ఇంట్లో వేడిని భరించలేక రాజ్‌కుమార్ తన ఇంటి ముందు ఖాళీ స్థలంలో మంద్రు సత్తి, ఏలేటి జీవరత్నం, పాలపర్తి చిన్ని మరికొందరితో కలిసి

రాజ్ కుమార్(ఫైల్)

కూర్చున్నాడు. అయితే నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షం, ఈదురు గాలుల వల్ల ఖాళీ స్థలంలో ఉన్న తాటి చెట్టు వంగిపోయి బలహీనమైంది. శుక్రవారం మధ్యాహ్నం వీచిన గాలికి తాటి చెట్టు విరిగి రాజ్ కుమార్‌పై పడడంతో వెంటనే స్పహ కోల్పోయాడు. ఈ ప్రమాదంలో మంద్రు సత్తి కాలుకు గాయమైంది. బాధితులను వెంటనే బంధువులు ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రాజ్‌కుమార్ మరణించినట్లు ధ్రువీకరించారు. పాలపర్తి చిన్నరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కిరణ్ కుమార్ చెప్పారు.

దాతలను ఆశ్రయించిన అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మునిసిపల్ కార్యాలయంలో మునిసిపల్ నిధులు (ప్రజాధనం) రూ.5 లక్షల నుంచి 6 లక్షలు నిధులతో ఇండోర్ క్రికెట్ నెట్ అధికారుల కోసం ఏర్పాటు చేస్తున్నారని దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ఇటీవల సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మునిసిపల్ అధికారులు ప్రత్యేక అధికారి మునిసిపల్ నిధులు వదులుకుని దాతలను ఆశ్రయించి క్రికెట్ నెట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

సాక్షి ఎఫెక్ట్

పొల్లూరు పిక్నిక్ స్పాట్ వద్ద యువకుడి మృతి

మోతుగూడెం: చింతూరు మండలం పొల్లూరు పిక్నిక్ స్పాట్ వద్ద స్నానాలు చేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి ఎం.అఖిల్ (24) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడి స్వస్థలం ఏలూరు జిల్లా కామవరపుకోట. మృతుడు ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. పదిమంది స్నేహితులతో విహార యాత్రకు వచ్చి పొల్లూరు పిక్నిక్ స్పాట్ వద్ద స్నానాలకు దిగి గల్లంతయ్యాడు. అప్రమత్తమైన స్నేహితులు గాలించగా అప్పటికే చనిపోయాడు. విషయం తెలుసుకున్న మోతుగూడెం ఎస్సై నాజర్ హుస్సేన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని చింతూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అఖిల్ మృతదేహం

సీఎం పర్యటనపై సమీక్ష

పెనుగొండ : సీఎం చంద్రబాబు ఈ నెల 9న సిద్ధాంతంలో పర్యటించనుండడంతో జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. 9న జరిగే సభలో రైతులకు పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. దీంతో శుక్రవారంస్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జాయింట్ కలెక్టరు టి రాహుల్ కుమార్ రెడ్డితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఏర్పాట్లు నిర్ణీత గడువులో పూర్తి చేసి పర్యటను విజయవంతం చేయడానికి సిద్ధం గా ఉండాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు.

8న హాకీ సెలెక్షన్స్

భీమవరం: ఆంధ్రప్రదేశ్ 16వ హాకీ సీనియర్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌కు జిల్లా హామీ జట్టు ఎంపికను ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కలిదిండి ఆనందరాజు, వివేక్ సత్యభారత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం సెయింట్ మేరీస్ హైస్కూల్ ఆవరణలో సోమవారం ఉదయం 7 గంటలకు ఎంపిక ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడకారులు 1992 జనవరికి ముందు జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఎస్ఎస్సీ మార్కుల జాబితా, జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్ తీసుకురావాలని; ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి నాలుగు రోజులపాటు ధర్మవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి టోర్నమెంట్ పాల్గొంటారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

ద్వారకాతిరుమల: స్థానిక సొసైటీ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు తీవ్ర గాయాలు పాలయ్యాడు. స్థానికుల కథనం ప్రకారం. మండలంలోని కొమ్మర గ్రామానికి చెందిన మానుకొండ ధర్మరాజు మధ్యాహ్నం ద్వారకాతిరుమలకు వచ్చి, పనులు ముగించుకుని తన టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై స్వగ్రామానికి వెళుతున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి మోపెడ్ అదుపు తప్పడంతో ధర్మరాజు రోడ్డుపై పడిపోయాడు. దాంతో అతడి తలకు, ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ ఈఎంటీ వెంకట్, పైలెట్ సుధాకర్‌లు క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి గురువారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై ఎన్‌వీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మైసన్నగూడెం గ్రామానికి చెందిన చదలవాడ గంగరాజు (56) ఈ నెల 4న పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులోని యూనియన్ బ్యాంకులో అకౌంట్ ప్రారంభించేందుకు వెళ్లాడుతూ అయితే అతడు రోడ్డు దాటుతుండగా అతన్ని మోటార్ సైకిల్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాల పాలైన గంగరాజుకు స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 4న రాత్రి మృతి చెందినట్లు వివరించారు. ఈ ఘటనపై గంగరాజు కుమారుడు వెంకట పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గల్ఫ్‌లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖతార్ దోహాలో హోమ్‌కేర్ నర్స్ రంగంలో ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. జితేంద్రబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న పురుషులు, స్త్రీలు ఈ ఉద్యోగాలకు అర్హులని పేర్కొన్నారు. అలాగే 2 సంవత్సరాల అనుభవం ఉన్న అభ్యర్థుల నుంచి 2 సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. నెలకు సుమారుగా రూ.1,30,000 వరకు జీతం ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, సంబంధిత ఎడ్యుకేషన్ సర్టిఫికెట్, అనుభవం ధ్రువీకరణ పత్రాలు, గుడ్ స్టాండింగ్ సర్టిఫికెట్, గ్రాడ్యుయేషన్ అటెస్టేషన్ సమర్పించాలని కోరారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నైపుణ్యం వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని లేదా హెల్ప్‌లైన్ నెంబర్ 9988853335కు ఫోన్ చేయాలని కోరారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్) మొబైల్ నెం. 80994 44378, ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, అస్తి తనిఖీ కొరకు : 89858 67892

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6)కు 9(1) నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)

SARFAESI చట్టం 2002 ప్రకారం సెక్షన్ 13(4) క్రింద దిగువ తెలిపిన ఆస్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిగా దిగువ సంతకందారు లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు బకాయిలు రాబట్టుకొనుటకు దిగువ తెలిపిన తనఖాపెట్టిన ఆస్తి/ఆస్తుల ఈ-వేలం (SARFAESI చట్టం 2002 క్రింద) "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" మరియు "అక్కడ ఏమున్నదో అదే" పద్ధతి పై నిర్వహించబడుతుందని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియజేయడమైనది మరియు నియమ నిబంధనలు దిగువ తెలుపబడినవి.

ఋణగ్రహీత(లు) : శ్రీ అడబాల పద్మాజీరావు, తండ్రి : వీర రాఘవులు, డోర్ నెం.2-190, అడబాల వారి తోట, సీతారామపురం, నరసాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534280. శ్రీ రావి భాస్కరరావు, తండ్రి : సత్యనారాయణ మూర్తి, డోర్ నెం.1-42/2, సీతారామపురం, నరసాపురం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 534280. డిమాండ్ నోటీసు తేది: 03-08-2021

డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం: తేది.30-07-2021 నాటికి రూ.58,68,632/- + భవిష్య వడ్డీ మరియు